శ్రీ శ్రీల జగదానంద పండితులు మరియు **శ్రీ రామానంద గౌడీయ మఠము, కొవ్వూరు** వారికి క్షమార్పణలతో

===============================================================================

ఒకానొక రోజున కాశీ మిశ్రుని భవనములో వేంచేసి ఉన్న శ్రీ చైతన్య మహాప్రభువును కృష్ణ దాసు అను ఒక భక్తుడు బ్రహ్మాది దేవతలకు గూడ గోచరముకాని కృష్ణ నామ మహిమను గురించి చెప్ప వలసినదిగా కోరెను. అపుడు శ్రీమన్మహా ప్రభువు ఇట్లు వివరించెను.

ఓ క్రిష్ణదాసా! కృష్ణ నామ మహిమ అపారమైనది. ఈ నామ ప్రభావమును గూర్చి క్రిష్ణునికే తెలియదనినను అతిశయోక్తి కానేరదు. ఐనను నామ మహిమను గురించి అనేక శాస్త్రములలో నేను గ్రహించిన దానిని నీకు చెప్పెదను. దీనిని విశ్వాసముతో శ్రద్దగా వినుము. ఫలితముగా నీవు ఈ ఘోర సంసార సముద్రము నుండి తరించగలవు.

హరినామమును ఉచ్చరించుట వలన సమస్త పాపములు తొలగిపోవును. అన్ని రకముల వ్యాధులు నిర్మూలనమగును. సమస్త దుఃఖములు సమసిపోవును. ఆకలి బాధ క్షీణించును. నరకములో నున్న వారు గూడ శీఘ్రముగా తరింతురు. ప్రారబ్ద కర్మము ఖండింప బడును. సమస్త అపరాధములు క్షీణించును.

దాన, వ్రత, హోమాది సమస్త కర్మలు నామమునే ఆశ్రయించును. వేదములన్నిటియందు సారభూతమై సూర్యుని వలె ప్రకాశించునది నామమే. సమస్త పుణ్య తీర్ధముల (ఫలితము) కంటే నామము సర్వోత్కృష్టమని సమస్త శాస్త్రములు ఘోషించుచున్నవి. సమస్త శుభకర్మలు నామముపై ఆధారపడి యున్నవి. ఐనను వాటి అన్నిటికంటే ఉత్తమ ఫలితమును ఒక్క నామమే ఒసంగును. భగవంతుని సర్వ శక్తులు నామము నందు ఇమిడి యున్నవి. సమస్త జీవరాసులకు ఆనందము నిచ్చునది భగవన్నామమొక్కటే. శ్రద్ధతో హరినామమును కీర్తించినవారు జగత్తులో పూజనీయులు. దిక్కులేని వారికి నామమే దిక్కు. పతితులను గూడ

పావనులనుగా జేయు సామర్థ్యము నామమునకు గలదు.

కృష్ణ నామమును సర్వకాల సర్వావస్థల యందు కీర్తించు వారు ఆ నామ సంకీర్తన వలననే ముక్తిని పొందుదురు. మరియు వారికి వైకుంఠ ధామములో నిరంతరము హరిని కీర్తించు భాగ్యము, భగవత్ప్రీతియు కలుగును. స్వయముగా నామమే పురుషార్థములనిచ్చును. భక్తి అంగములలో నామము ప్రధానమైనదని శృతి, స్మృతి, శాస్త్రములు చెప్పుచున్నవి. దీనికి అసంఖ్యాకములైన ప్రమాణములు గలవు.

**నామము** సర్వ పాపములను **వినాశనము చేయును:**

**1. అయం హి కృత నిర్వేశో జన్మకోట్యంహసామపి**
**యద్వ్యాజహార వివశో నామ స్వస్త్యయనం హరేః (భాగవతము 6-2-7)**

సమస్త పాపములను నశింపజేయుటయే నామము యొక్క ప్రప్రథమ ధర్మము. దానికి ప్రమాణం ఏమనగా - అజామిళుడు అవసానకాలమందు "నారాయణ" శబ్దము ముమ్మారు ఉచ్చరించి కోటి కోటి జన్మలలో చేసిన పాపరాశులనుండి ముక్తిని బొంది భగవత్సాన్నిధ్యము జేరెను.

**సమస్త వ్రతములకంటే నామము ఉఛ్ఛమమైనది.**

**2. న నిష్కృతై రుదితై: బ్రహ్మ వాదిభి**
**స్తథా విశుధ్యత్యఘవాన్ వ్రాతాదిభి:**
**యథా హరేర్నామ పదైరుదాహృతై**
**సదుత్తమః శ్లోక గుణోపలంభకం (భాగవతము 6-2-11)**

చాన్ద్రాయణాది వ్రతములు పాపాత్ములను పాపముల నుండి శాస్త్రములలో చెప్పిన రీతిని తరింప జేయలేవు. ఏలననగా, తాత్కాలిక వ్రతాదుల వలన పాప వాసన, పాప భీజము నశింపవు.

కాని కృష్ణ నామమును ఉచ్చరించుట వలన పూర్వక్రుత పాపమే గాక, పాపమునకు మూలకారణమగు అవిద్య గూడ తొలగి పోవును.  సమస్త పాపములనుండి రక్షించి ముక్తి నొసంగునది నామమే కావున దీనికి మించిన వ్రతము వేరొకటి లేదు.

**సాంకేత్యం పారిహాస్యం వా స్తోభం హేలనమేవ వా**
**వైకుంఠనామ గ్రహణ మశేషాఘహరం విదు: (భాగవతము 6-2-14)**
ప్రాపంచిక ఫలితములనాశించి గాని ఇతరులను హేళన చేయు ఉద్దేశ్యముతో గాని, గానము చేయవలెనని గాని, అశ్రద్ధతో గాని వైకుంఠుని నామమును ఎవరు ఆశ్రయించుదురో, వారి అశేష పాపములు హరింపబడును.  ఈ విషయమును శాస్త్రవేత్తలగు భాగవతోత్తములు తెలిసికొని ఉన్నారు.

**పతితః స్ఖలితో భగ్నః సందష్టస్తప్త ఆహతః**
**హరిరిత్యవశే నాహ పుమాస్ నార్హతి యాతనాః (భాగవతము 6-2-15)**
పైనుండి క్రింద పడినపుడు గాని, నడచుచు జారినపుడు గాని, శరీరమునకు గాయము తగిలినపుడు గాని, సర్పాది క్రూర జంతువుల వలన హాని కలిగినపుడు గాని, రోగపీడితుడైనపుడు లేదా ఇతరులు శిక్షించినపుడు గాని ఎవరు కృష్ణ, హరి, నారాయణ అను నామములను ఉచ్చరించుదురో వారికి ఎన్నడును నరక బాధ కలుగదు.

**అజ్ఞానా దథవా జ్ఞానాదుత్తమః శ్లోకనామ యత్**
**సంకీర్తితమఘం పుంసో దహేదేధో యథా 2నలః (భాగవతము 6-2-18)**
అగ్ని ఏ విధముగా గడ్డి మేటిని దగ్ధింపజేయునో అట్లే  ఎవరు తెలిసి గాని, తెలియక గాని ఉత్తమః శ్లోకుడగు భగవంతుని నామమును కీర్తించుదురో వారి సమస్త పాపరాశి భస్మీ భూతమగును.

గోవింద కీర్తనమనేది అగ్ని జీవుల యొక్క భూత భవిష్యద్ వర్తమానముల పాపములనన్నిటిని

అనాయాసముగా దహించి వేయును. కావున కలియుగములో నామము కంటే జీవులకు బంధువు లేరు (లఘు భాగవతము).

ఈ భూలోకమున నిరంతరము సజ్జనులను పీడించు ద్రోహ చింతన గలిగిన వారు గూడ సదా హరికీర్తన వలన పవిత్రులై ధన్యులగుదురు(లఘు భాగవతము).

శాస్త్రములలో లెక్కలేనన్ని ప్రాయశ్చిత్తములు చెప్పబడి యున్నవి. కాని అవి ఏవియు కృష్ణ నామ కీర్తనమునకు సమము కానేరవు. (కూర్మ పురాణము)

ఏ పాపియు గూడ చేయలేనంతటి పాపమును గూడ హరింప జేయ గల శక్తి నామమునకుఉన్నది . భగవన్నామ మహిమ అంతటిది. అనగా నామము ఎంతటి పాపమునైనాను తుడిచి వేయునని అర్థము.
(కూర్మ పురాణము)

ఎవరు అచ్యుత, గోవింద, మధుసూదన యని భగవంతుని నామమును ఆర్తితో ఉచ్చరించుదురో వారి సర్వ రోగములు (శారీరక, మానసిక) నశింప బడును. ఇది ముమ్మాటికీ సత్యము (బృహద్ నారదీయము).

మహాపాతకుడైనను అహర్నిశము జగదీశ్వరుడగు హరిని కీర్తించిన యెడల అంతః శుద్ధి గలిగి సజ్జన సాంగత్యమునకు యోగ్యత కలుగును(బ్రహ్మాండ పురాణము).

మహావ్యాధి పీదితుడైన వాడు, రాజదండనము అనుభవించువాడు 'నారాయణ' అని ఆర్తితో నుచ్చరించినచో వారు ఆయా బాధల నుండి తత్ క్షణము విముక్తులగుదురు (వహ్ని పురాణము).

నిరంతరము హరినామ కీర్తనము చేయువారికి సర్వరోగములు; క్లేశములు; సర్వ ఉపద్రవములు; సర్వ అరిష్టములు తొలగిపోవును (బృహద్ విష్ణు పురాణము).

సూర్యుడు అంధకారమును, ప్రబలమగు వాయువు మేఘములను దూరీభూతము చేయునట్లు అనంతుడైన భగవంతుని నామమును ఆశ్రయించిన వారికి (అనగా శ్రవణ, కీర్తనము చేయు వారికి) వ్యసన రూప దుఃఖములన్నియు పటాపంచలగును. (భాగవతము 12-12-48)

కష్టము వచ్చినపుడు, మనో వ్యాకులత ఏర్పడినపుడు, పతనమొందినపుడు, భయము కలిగినపుడు, ఘోరమైన వ్యాధి పీడితుడై దానికి నివారణోపాయము లేనపుడు "నారాయణ" శబ్దము నొక్కసారి కీర్తించినచో సమస్త దుఃఖములనుండి విముక్తులై సుఖశాంతులను పొందగలరు (విష్ణు ధర్మోత్తరము).

సర్వ శక్తి సంపన్నుడును, తేజశ్శాలియు, దేవ దేవుడునగు భగవంతుని నామ సంకీర్తనము యక్ష రాక్షస భేతాళ, భూత, ప్రేత, ఢాకిని మొదలగు హింసక వ్యక్తుల యొక్క సర్వానర్ధములు హరింప్బబడుచున్నవి. మరియు ఆకలి దప్పిక జారిపడుట మొదలగు దుఃఖములనుండి కూడా అతి శీఘ్రముగా విముక్తులగుదురు. ఇందు సంశయమేమియులేదు . విశ్వాసముతో నామమును చేయువారు ఫలితమును తప్పక పొందుదురు (విష్ణు ధర్మోత్తరము).

కలికాలమనేడి దుష్ట సర్పము యొక్క భయంకర కోరలను జూసి ఎవరును భయపడ నవసరము లేదు. గోవిందనామ మనెడి దావానలము కలిసర్పమును భస్మీభూతము చేయగలదు. (స్కాంద పురాణము)

ఘోరమైన ఈ కలియుగములో హరినామమునాశ్రయించిన మానవులు కృత క్రుత్యులై కలిబాధ నుండి విముక్తులగుదురు. అట్టివారు హరి నామమును తప్ప వేరొక సాధనను స్వీకరింపరు. హరే! కేశవ! గోవింద! మున్నగు నామములను ఉచ్చరించుట వలన కలి బాధించదు. ఎవరు విశ్వాసముతో భగవన్నామమును స్మరణ చేయుదురో వారికి హృదయ పవిత్రత గలిగి సుఖ శాంతులు వృద్ధి యగును. మరియు వారు ఆ నామమందే రమింతురు. (విష్ణు ధర్మోత్తరము)

నరకములో నున్న వారైనను ఏ విధముగానైనను నామమును ఎవరు ఆర్తితో కీర్తింతురో వారు ఆయా విధముగా భక్తిని పొంది దివ్యమైన భగవత్సాన్నిధ్యము జేరగలరు.

ముక్తిని బొందవలేననేది కోరిక గలవారాలకు తీర్థ పద స్వరూపుడైన భగవంతుని నామమును కీర్తించుట కంటే కర్మ బంధముల తొలగించు వేరొక మార్గము లేదు. కారణమేమనగా నామ సంకీర్తన వలన చిత్తము కర్మ యందు లిప్తము కాదు. ప్రాయశ్చిత్తాదుల వలన (తాత్కాలిక ముక్తి లభించినను) మరల రజస్తమోగుణముల వలన మనసు కలుషితమగును. (భాగవతము 6-2-46)

ఎవని నామధేయమును మరణశయ్యపై ఉండి గాని ఇంద్రియముల పటుత్వము తగ్గినపుడు గాని ఆతురతతో నున్నపుడు గాని గద్గద స్వరముతో ఉచ్చరించిన సమస్త కర్మలనుండి విముక్తులై ఉత్తమ గతిని బొందగలరో అట్టి భగవానుని నామమును ఈ కలియుగ జీవులు సేవించలేరు కదా! (భాగవతము 12-3-44)

ఎవరు కుటిలత్వము లేక శ్రద్ధతో నాయొక్క నామమును చేయుదురో అట్టి వారి కోటి అపరాధములనైనను నేను క్షమించుదును. ఇందు సంశయము లేదు. ఈ విషయమందు ఎవరికి విశ్వాసము లేదో వారు నిజముగా మందభాగ్యులు. అట్టివారి తరణమునకు మార్గము లేదు అని మహా విష్ణువు చెప్పెను (విష్ణు యామలము)

మంత్ర, తంత్రముల వలనను ఆయా దేశకాలములలోని వస్తువుల వలనను ఏర్పడిన దోషములను నామసంకీర్తన మాత్రము పోగొట్టుచున్నది. సమస్త సత్కర్మల కంటెను నామము శ్రేష్టమైనది . దానిని ఆశ్రయించిన వారికి ఇతర శుభకర్మలను చేసిన సిద్ధి గూడ లభించును. (భాగవతము 8.23.16).

"హరి" యను రెండు అక్షరములను ఉచ్చరించువారు ఋక్, యజు, స్సామ, అథర్వణ వేదములను అధ్యయనము చేసినట్టి వారలగుదురు. నామము సర్వ వేదములకంటేను

అధికతరము. ఈ విషయమున సంశయము ఉన్నవారికి ఎన్నడును శ్రేయస్సు గలుగదు. చతుర్ముఖ బ్రహ్మ నుండి వెలువడిన వేదములయొక్క సారము ప్రణవము. ఆ ప్రణవము కృష్ణుని యొక్క నామము. (విష్ణు ధర్మోత్తర పురాణము)

చతుర్వేదములను ఏల పఠించుడువు? గోవిందా గోవిందా అని నిత్యము గానము చేయుము **(స్కాంద పురాణము)**

విష్ణు నామము ఒక్కొక్కటి సర్వ వేదములకంటే అధికమైనది. అట్టి సహస్ర నామములు ఒక్క "రామ" నామమునకు సమానము. **(పద్మ పురాణము)**

సహస్ర నామములను ముమ్మారు (లేక మూడు సార్లు రామ నామము) పఠించైనా చో ఏ ఫలితము పొందుదుమో ఆ ఫలితమును ఒక్కసారి కృష్ణ నామము ఉచ్చరించినంత నే లభ్యమగును. కావున భక్తులారా! కృష్ణ నామమును నిరంతరము కీర్తించుడు. **(బ్రహ్మాండ పురాణము)**

**హరేకృష్ణ హరేకృష్ణ క్రిష్ణక్రిష్ణ హరేహరే| హరేరామ హరేరామ రామరామ హరేహరే||**

పదహారు నామములతో కూడిన ఈ మహామంత్రము సర్వోత్కృష్టమైనది. ఈ నామజపము వలన సర్వ సిద్ధులు లభించును.

ఎవని నాలుకపై అహర్నిశము హరినామము తాండవము చేయునో వానికి కురుక్షేత్రము, కాశి, పుష్కర క్షేత్రము మొదలుగు తీర్థ పర్యటనల అవసరమేమి? **(స్కాంద పురాణము)**

సహస్ర కోటి తీర్థ యాత్రలు చేసినంతటి ఫలితమును అతి శీఘ్రముగ నిరంతర నామ సంకీర్తన వలన పొందగలము **(వామన పురాణము)**

ఒకానొకప్పుడు కురుక్షేత్రములో విశ్వామిత్రుడు తన భక్త సమూహమునకు ఇట్లు చెప్పెను. "ఈ భూమండలము నందు గల అనేక తీర్థములను గురించి వింటిని. కాని హరి నామము యొక్క కోటి అంశముతోనైనను అవి ఏవియు సమము కానేరవు. నామము అంతటి విలువైనది". **(విశ్వామిత్ర సంహిత)**

వేద, ఆగమ, శాస్త్రాదుల పఠనము వలనను, అనేక తీర్థ పర్యటనల వలనను ఏమి ప్రయోజనము? ఒకవేళ నీకు ముక్తి కావలయునని నచో గోవిందా! యని అనుక్షణము స్పష్టముగా కీర్తించుము. **(లఘు భాగవతము)**

సూర్యగ్రహణ కాలమందు కోటి గోవులను దానము చేసినను, మాఘ మాస వ్రత నియమానుసారము ప్రయాగ లో గంగానదీ తీరమందు కల్పము వరకు నివాసము చేసినను, అసంఖ్యాకములైన యజ్ఞములు చేసినను, మేరు పర్వత సమానమగు సువర్ణ దానము చేసినను, గోవింద కీర్తనములో నూరవ అంశమునకు అవి అన్నియును సమము కానేరవు. **(లఘు భాగవతము)**

చెరువులు, నూతులు, తోటలు నిర్మించుట, మొదలగునవి పుణ్య కర్మలైనను బంధన హేతువులే అగుచున్నవి. శ్రీహరి నామ సంకీర్తనమొక్కటే శ్రీహరి పాదారవిందముల యొద్దకు మనలను చేర్చగలదు. **(బోధాయన సంహిత)**

రాజేంద్రా! సాంఖ్య, యోగ శాస్త్రములతో నీకు పని ఏమున్నది? నీకు ముక్తి కావలయునేని గోవిందనామ కీర్తనము చేయుము **(గరుడ పురాణము)**

స్వపచుడైనను నీ (భగవానుని) నామమును నాలుక యందు ఉంచు కొనుటచే సర్వోత్కృష్టుడగును. నామమును ఉచ్చరించు వారు తపస్సులు చేసినట్టివారు, హోమము

చేసిన వారు, సర్వ తీర్థముల స్నానమొనర్చిన వారు, వేదమును అధ్యయనమొనర్చిన వారే యగుదురు. **(భాగవతము 3.33.7)**

నిరంతర కృష్ణనామ సంకీర్తనముచే కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యములు నశించుచున్నవి. సర్వబాహ్యశత్రు వినాశమును కలుగుచున్నది. ఆధ్యాత్మిక వైభవ సిద్ధికి నామ కీర్తనమే మూలకారణమగుచున్నది. **(స్కాంద పురాణము)**

నా నామమును నిరంతరము ఉచ్చరించువారు క్రుతార్థులును ధన్యజీవులును అగుచున్నారు. వారు సార్థక జన్ములగుచు సర్వార్థ సిద్ధి నొందిన వారగుచున్నారు.
కలి యుగమందలి పాపజన్ములలో మిక్కిలి దుర్లభమైన హరి నామమును ఒక్క సారి అయిన ఉచ్చరించువాడు ధన్యతముడు అగుచున్నాడు. ఇందు సంశయమేమియు లేదు. గుణజ్ఞులు, సారజ్ఞులు అగు మహాత్ములు ఈ కలియుగమును పొగడుచున్నారు. ఏమన, ఈ కలియుగమందు క్రిష్ణనామోచ్చారణచే మానవ కోటికి సర్వార్థ సిద్ధి కలుగుచున్నది. శ్రీహరి నామ సంకీర్తనమే ఈ కలియుగమునకు సర్వోత్తమరూప తపస్సగుచున్నది. కనుక శ్రీకృష్ణ ప్రీతికి అతని నామమును కీర్తించుట యే అవశ్య కర్తవ్యమగుచున్నది. **(భాగవతము 1-5-36)**

దానములు, వ్రతములు, తపస్సులు, తీర్థయాత్రలు, దేవతా పూజనము, సాధు పూజనము, అశ్వమేధము, రాజసూయము మొదలైనవి చేయుట చేతను, ఆత్మజ్ఞానము కలుగుతచేతను సమస్త పాపములు నశించుచున్నవి. వానియందలి శక్తులన్నియు శ్రీహరి చేత ఆయా కర్మలనుండి ఆకర్షిమ్పబడి తన నామముల యందు అర్పింపబడినవి. **(స్కాంద పురాణము)**

హృషీకేశా! నీ నామ మహిమను కీర్తించుచు జగత్తంతయు ఆనందము నొందు చున్నది. నీ కీర్తనమందు అనురాగము కలిగినదగుచున్నది. నిన్ను చూచి రాక్షసులందరును నలుదిక్కులకు పారిపోవుచున్నారు. సిద్ధులందరూ నీకు నమస్కరించుచున్నారు. **(గీత 11.36)**

ఓ నారాయణా! ఓ జగన్నాథా! ఓ వాసుదేవా! ఓ జనార్ధనా! అనుచు నిత్యమూ

భగావన్నామోచ్చారణము చేయువారు ప్రపంచమునకంతటికీ వందనీయులగుచున్నారు. నిద్రించుచుగాని, భుజించుచు గాని, నడచుచు గాని, కూర్చుండి గాని, లేచుచు గాని, సంభాషించుచు గాని, నిత్యమూ హరి నామోచ్చారణము చేయువానికి నేను దండవత్ప్రణామము చేయుచున్నాను.  కావున దీనివలన దీక్షా ప్రాయశ్చిత్తముల ఆవశ్యకత లేదనియు, నామోచ్చారణమునకు కాలనియమము లేదనియు సూచింపబడినది. **(బృహన్నారదీయము)**

నిశ్చల భక్తితో సదా హరినామ సంకీర్తనము చేయునట్టి స్త్రీలకు, శూద్రులకు, చందాలురకు, పాపయోనులగు నితరులకు, నేను మాటి మాటికి నమస్కరించుచున్నాను **(నారాయణవ్యూహస్తవము)**.

దిక్కులేని వారును, విషయ భోగ పరాయణులును, పరబాధకులును, జ్ఞానవైరాగ్యశూన్యులును, బ్రహ్మచర్యము నుండి భ్రష్టులైన వారును, స్వధర్మచ్యుతులైన వారును, కృష్ణ నామోచ్చారణము చేసినంత మాత్రమున సద్ధర్మ పరులకు గూడ లభ్యము కాని భగవత్ప్రాప్తి రూపమగు ఉత్తమగతిని పొందుచున్నారు.

హరినామ సంకీర్తనమునకు దేశ కాల నియమమెంత మాత్రము లెదు.  ఎంగిలి నోటితోనైనను భగవన్నామము చేయ వచ్చును. **(విష్ణు ధర్మము)**

శ్రీహరి సర్వమును పవిత్రము చేయుచున్నాడు కనుక నామసంకీర్తనమునకు అశౌచ భయము లేదు.  కావున భగవంనామమును సదా సర్వత్ర కీర్తింపవలెను.  **(స్కాంద పురాణము)**

శ్రీహరి నామోచ్చారణమునకు దేశ కాల నిబంధనలు ఎంత మాత్రమును లేవు.  దానము, యజ్ఞము, మంత్ర జపాదులకు మాత్రమె దేశ కాల నియమములు గలవు గాని భగవన్నామొచ్చారణమునకు అవి ఎంత మాత్రము లేవు **(వైష్ణవ చింతామణి)**

సంసార సముద్రము నుండి ఉత్తీర్ణులగుటకు తలంపు గలిగిన యోగీశ్వరులకు కూడా

హరినామమే శరణ్యము.

హరి నామము కంటే ముల్లోకములందును సులభముగా ముక్తినిచ్చు సాధనము మరొకటి లేదు. నామమే జీవులను తరింపజేయును. హరి యను రెండు అక్షరములను ఉచ్చరించిన మాత్రమున మోక్షము నొందుటకు అర్హులగుదురు. **(స్కాంద పురాణము)**

జితేంద్రియులై ఎవరు నారాయణ యని ఉచ్చరించుదురో వారు చిత్తశుద్ధులై నిర్వాణమును బొందుదురు **(పద్మ పురాణము)**

భయంకరమై సంసార సముద్రములో పడి జనన మరణములకు లోనగుచున్న వివశుడైన జీవుడు హరినామమును ఉచ్చరించుచు అచిర కాలములోనే దాని నుండి ముక్తుడగును. అట్టి హరినామమును చూచి కాలమే భయపడుచున్నప్పుడు ఇక యమదూతల మాట చెప్పనేల? **(భాగవతము 1.1.14)**

ఎవరు అవసాన కాలములో వివశులై భగవంతుని (దేవకీనన్దనుని) నామ, రూప, గుణ, లీలలను ఉచ్చరించుదురో వారు అనేక జన్మార్జిత పాపముల నుండి శీఘ్రముగా ముక్తి నొంది, సచ్చిదానంద స్వరూపుడగు భగవంతుని పొందుదురు. కావున జన్మ రహితుడైన అట్టి భగవంతుని నేను శరణు బొందుచున్నాను అని బ్రహ్మ స్తుతించెను **(భాగవతము 3.9.15)**

నడచుచున్నప్పుడు, కూర్చున్నప్పుడు, స్వప్నమందు, భోజన, శయన కాలములందు, కలిదమనమైన భగవన్నామమును హేళనముగా అయినా ఉచ్చరించినవారు నిర్భయముగా పరమపదమగు వైకుంఠమును జేరుదురు **(విష్ణు పురాణం)**

కాలు జారినప్పుడు గాని, సురాపానము చేయునప్పుడు గాని, లేక ఎట్టి పరిస్థితిలో నున్నను వాసుదేవుని కీర్తించినచో భగవదనుగ్రహముచే ముక్తినొందుదురు. దీనిని బట్టి భగవంతుడు ఎంతటి కరుణామయుడో తెలియుచున్నది. **(వరాహ పురాణము)**

దామోదర కీర్తనమే పరమ పురుషార్థము. అదియే మంగళ దాయకమైనది. హరి నామ కీర్తనమే వాస్తవమైన సంపద, అదియే జీవితము యొక్క చరమ ఫలము అని సమస్త శాస్త్రములు ఘోషించు చున్నవి **(పద్మ పురాణం)**

కృష్ణ నామము మధురాతి మధురము. శ్రేయస్సులన్నిటి కంటే శ్రేయస్సు, సమస్త వేదముల యొక్క ఫలము, చిత్స్వరూపము. ఆ కృష్ణ నామమును ఎవరు శ్రద్ధతో గాని, హేళనతో గాని కీర్తించుదురో వారు తప్పక తరింతురు. ఇందు సంశయము లేదు **(ప్రభాస ఖండము)**

భక్తిని గురించి చెప్పిన శాస్త్రములన్నిటి యందు నామ సంకీర్తనమే సర్వశ్రేష్ఠమని నిరూపించబడినది. ఏలననగా అష్టాంగ యోగము వలన భగవత్స్మృతి లభించుట బహు కష్టము. కాని పెదవి కదిలించినంత మాత్రముననే నామ సంకీర్తన యగుచున్నది. **(వైష్ణవ చింతామణి)**

ఎవరు శ్రద్ధతో శతజన్మములు వాసుదేవుని అర్చించుదురో అట్టి వారి జిహ్వాగ్రమందు హరినామము సదా నృత్యము చేయును. **(వైష్ణవ చింతామణి)**

కృత యుగమందు అనేక సంవత్సరములు ధ్యానము చేత, త్రేతాయుగమందు యజ్ఞముచేత, ద్వాపర యుగమందు అర్చనము చేత ఏ ఫలితమును పొందుదుమో ఆ ఫలితమును కలియుగములో కేశవుని సంకీర్తనము వలన పొందగలము. **(విష్ణు పురాణం)**

మహా భాగవతోత్తములైన వారు ఈ కలియుగము లో నిత్యము సంకీర్తనము చేయుచుందుదురు. **(స్కాంద పురాణము)**

చిదాత్మకమైన హరినామోచ్చారణ ఫలితమును బ్రహ్మ, శివుడు, అనంతుడు గూడా వర్ణించలేరు. నామోచ్చారణ ఫలితము అంతటి మహాద్భుతమైనది. అట్టి నామమును ఉచ్చరించిన మాత్రమున మానవులు పరమ పదమును పొందుదురని శాస్త్రములు చెప్పుచున్నవి.

శ్రీకృష్ణుడు అర్జునునకు ఈ విధముగా చెప్పెను -
ఓ అర్జునా! ఎవరు శ్రద్ధతో గాని, హేళన తో గాని నా యొక్క నామమును ఉచ్చరించుదురో ఆ నామము నా హృదయములో నుండును. నామముతో సమమైన వ్రతము గాని, జ్ఞానము గాని, ధ్యానము గాని, ఫలము గాని, త్యాగము గాని లేదు. నామముతో సమమైన పుణ్యము గాని, మరి ఏదియూ సమానమైనది లేదు. నామము యొక్క మహిమను వేదములు గూడ వర్ణించలేవు. నామమే పరమ ముక్తి, పరమ గతి, పరమ ప్రీతి, పరమ స్మృతి, జీవునకు నామమే కారణము, నామమే జీవునకు ప్రభువు, పరమ ఆరాధ్య వస్తువు. నామమే పరమ గురువు. **(బృహన్నారదీయము)**

భగవన్నామము ఎంతటి మహత్తరమైనదనిన, దానిని కొంచెము శ్రవణము చేసినను, కడజాతికి జెందిన వారు గూడ సంసారము నుండి విముక్తులగుదురు. **(భాగవతం 6-16-44)**

కృష్ణా! కృష్ణా! యని ఎవరు నన్ను నిత్యము స్మరించుదురో వారిని జలము నుండి పద్మము వాలే నేను నరకము నుండి రక్షించుదును. **(నరసింహ పురాణం)**

ఎవరు స్వప్నమందు గాని, జాగ్రదావస్థ యందు గాని కృష్ణ నామమును నిత్యము స్మరించుదురో, వారు కలియుగములో కృష్ణ రూపులై కృష్ణ సన్నిధానమును జేరుదురు.

సర్వోత్కృష్టమైన కృష్ణ నామము ప్రాయశ్చిత్తములన్నిటికంటే ఉత్తమమైనది. జీవుడు కృష్ణ నామమును ఆశ్రయించుట వలన అశేష పాపములనుండి విముక్తుడగును. **(ప్రభాస ఖండము)**

నామము చింతామణి వంటిది. చైతన్య రస స్వరూపము. పూర్ణమైనది, శుద్ధమైనది, నిత్యముక్తమైనది. నామమునకు నామికి (భగవంతునకు) భేదము లేదు. **(భక్తి రసామృత సింధువు)**

విష్ణు నామము, విష్ణు శక్తి యొక్క ప్రభావమును గ్రహించిన బుద్ధిమంతులు, అప్రాకృత తత్వమును తెలిసికొన వలయుననియు, సుబుద్ధి కావలయునని భగవంతుని ప్రార్థింతురు. **(ఋగ్వేదము)**

'స్తానేశ్వరి క్రుష్ణదాసుడు' వినయ విధేయతలతో 'శ్రీమన్మహా ప్రభో! నాయొక్క ప్రార్థనను ఆలకించవలెను' అని కోరెను. నామము యొక్క ఇంతటి ఉత్కృష్టమైన మహాత్మ్యమును వింటిని. కాని ఈ ప్రకారముగా నామము చేసిన వారికి ఫలితము గలుగకుండుటకు కారణమేమి?

మహా ప్రభు: అన్నిటికి శ్రద్ధ, విశ్వాసమే కారణము. విశ్వాసము లేని కారణముగా ఫలితము లభించుట లేదు. భగవంతుడు అంతర్యామి స్వరూపుడు. నామము చేసిన వారి హృదయమున ఎంతటి విశ్వాసముండునో వారికి అంతటి ఫలితమునే ఇచ్చును. నామ మహిమ యందు పరిపూర్ణ విశ్వాసములేని కారణముగా పూర్ణ ఫలితమును పొందజాలకున్నారు. నామమును అర్థవాదమని అనేకులు భావించుదురు. దానివలన విశ్వాసహీనులై నామ ఫలితమును బొందలేరు.

<u>**నామ రహస్యము:**</u>

సాక్షాత్ గోలోక విహారి యగు శ్రీకృష్ణ భగవానుడు రాధాకృష్ణ మిళిత తనువై కలియుగములో 1486 వ సంవత్సరములో శ్రీ చైతన్య మహాప్రభువుగా నవతరించిరి. కృత, త్రేతా, ద్వాపర యుగములలో క్రమముగా ధ్యాన, యజ్ఞ, అర్చనాదులు సాధనములుగా పేర్కొనబడినవి. కాని కలియుగ జీవులు అల్పాయుష్కులు, కుటిల చిత్తులు కావున సులభముగా తరించి భాగవత్సాన్నిధ్యమును జేరుటకు హరినామ సంకీర్తనమే యుగధర్మముగా ఏర్పరచిరి. శ్రీమన్మహాప్రభువు యొక్క అవతార ప్రయోజనము జాతి, మత, కుల వివక్షణ లేక సర్వ ులను నామ సంకీర్తన ద్వారా తరింప జేయుటయే.

ఒకానొక రోజున వెన్నెలనాటి రాత్రి వాతావరణము ప్రశాంతముగా నున్నది. సముద్ర తీరమున మహాప్రభువు తన భక్త బృందముతో సమావెశమైరి. అపుడు ఆయన భక్త హరిదాసు మున్నగు

వారితో నామ రహస్యమును గురించి ఈ విధముగా విశదీకరించిరి.

ఓ భక్తులారా! ఈ కలియుగములో శ్రీకృష్ణ నామ స్మరణము తప్ప వేరు మార్గము లేదు. అప్రాకృత సంపత్తిని పొందుటకు కర్మ, జ్ఞాన, యోగ, ధ్యానాదులు దుర్బలమైనవి. ధర్మ, వ్రత, హోమ, త్యాగాదులు ప్రక్రుతి సంబంధములు. అప్రాకృత తత్వమును పొందుటకు అవి సహకరించవు. కృష్ణ నామ శ్రవణ, స్మరణ, కీర్తనములచేత అప్రాకృత సిద్ధి లభించునని సర్వ శ్రుతులు ఘోషించుచున్నవి. నామ ఉచ్చారణ మాత్రముననే చిత్సుఖము లభించునని నామము యొక్క రహస్యమును సమస్త శాస్త్రములు తెలియజేయు చున్నవి.

పద్మ పురాణమందు స్వర్గ ఖండములో నామ రహస్యమును గురించి శ్రీ సూతుల వారికి శౌనకాది మహర్షులకు ఈ క్రింది విధముగా సంవాదము జరిగినది.

శౌనకుడు సూతునకు నమస్కరించి ఇట్లు అడిగెను -

సాధువులలో ఉత్తముడ వైన ఓ సూత మునీంద్రా! నామోచ్చారణ మహాత్మ్యము వినుటకు పరమాద్భుతముగా నున్నది. ఏ నామ ఉచ్చారణ మాత్రమున మానవులు తరించి పరమ పదమును చేరుదురో అట్టి నామ సంకీర్తనమును గురించి, దానిని చేయవలసిన విధానమును గురించి దయచేసి విపులీకరించ వలసినది అని వేడగా, సూతుల వారు ఇట్లు సమాధాన మొసంగెను. శౌనకా! మోక్ష సాధనమును గూర్చి చెప్పెదను వినుము. పూర్వము నారదుడు అడుగగా సనత్కుమారుడు చెప్పిన దానిని నీకు చెప్పెదను.

ఒకసారి యమునా తీరమునందు ప్రశాంత మనస్కుడై యున్న సనత్కుమారునికి నమస్కరించి నారదుడు ఇట్లు అడిగెను.

**శ్రుత్వా నానావిధాస్ ధర్మాస్ ధర్మవ్యతికరాం స్తథా!**

**శ్రీ నారద ఉవాచ:**

**యోऽసా భగవతాప్రోక్తో ధర్మవ్యతికరో నృణాం**

**కథం తస్య వినాశః స్యాదుచ్యతాం భగవత్ప్రియ**

అని నారదుడు సనత్కుమారుని ప్రశ్నించెను. (ఈ శ్లోకం యొక్క తెలుగు వివరణ పుస్తకములో ఇవ్వబడ లేదు. Miss అయినట్లు అనిపిస్తోంది. దయచేసి ఎవరైనా సంస్కృతము తెలిసిన వారు ఈ శ్లోకం యొక్క అర్థం వివరించ ప్రార్థన).

ఈ ప్రశ్న యొక్క రహస్యమునందు ఒక విశేషము గలదు. ఆ విషయమును చెప్పెదను. రామానందా! స్వరూప దామోదరా! శ్రద్ధగా వినుడు.

**నామ సంకీర్తన మనగా నేమి? ఉచ్చారణ అనగా నేమి?**

"ఉచ్చారణ" శబ్దమునే సంకీర్తన యందురు. కొందరు భక్తులు జపమాలతోను, కొందరు సంఖ్యానామముతోను, మరికొందరు సంఖ్యను విడిచి అసంఖ్యాకముగాను చేయుదురు. వీటినన్నిటిని ఉచ్చారణమని తెలిసికొనుము.

**జపము, కీర్తనము:**

మౌనముగా లేక లఘు ఉచ్చారణముతో చేసిన నామమును జపమనియు, ఉచ్చైస్వరముతో చేసిన నామమును కీర్తనమని అందురు. ఏ విధముగా కీర్తనము చేసిన యెడల ఉత్తమమైన కీర్తన యగునో అది "నామ సంకీర్తనము" అను గ్రంథము నందు విపులముగా చెప్పబడినది.

**నామ సంకీర్తనమే సర్వదా సర్వత్ర కర్తవ్యము:**

శ్రీ నామ సంకీర్తనము జీవుని యొక్క నిత్య ధర్మము. భూలోక మందున్నను, వైకుంఠమునందున్నను జీవునకు సంకీర్తనము చేయుటయే ముఖ్య కర్తవ్యము. సంకీర్తనము బద్ధ జీవునకు మోక్ష సాధనముగాను, ముక్త జీవునకు సాధ్యముగాను సహకరించును.

**భక్తిహీన శుభ కర్మలను త్యజింప వలెను:**

ధర్మశాస్త్రములలొ చెప్పబడిన భక్తిహీన ధర్మములను, భక్తిరహితమైన వ్రతములను, భక్తికి

తోడ్పడని వైరాగ్యమును త్యజింపవలెను. భక్తికి ప్రతికూలమైన యజ్ఞయాగాదులు గూడా ప్రకృతికి సంబంధించినవే యగును. అనగా అవి ఐహిక విషయ భోగములనే కలుగజేయును. పైన చెప్పిన శుభ కర్మలన్నియు భక్తికి అనుకూలముగా నుండవలెనని శాస్త్రములు తెల్పుచున్నవి. కలికాలములో ఈ ధర్మములన్నియు జడములు, భక్తికి అనుకూలముగాలేని కారణమున ధర్మమూ నశించినది. కావున కలికాలములో నామ సంకీర్తన తప్ప ఇతర ధర్మములు లేవు. ఏ ధర్మము భక్తికి వ్యతిరేకముగానుండునో దానిని వదలివేయ వలెను.

ఇంకను సనత్కుమారుడిట్లు చెప్పెను.

ఓ నారదా! నీవు గోవింద ప్రియుడవు. గోవిందుని ధర్మమును బాగుగా తెలిసినవాడవు. మాయా బంధనమును చేదించు కొనిన వాడవు. కావున నీవు అడిగిన ప్రశ్న లోకహితము కొరకే గాని నీ కొరకు గాదు. నీ ప్రశ్నల వలన జీవులు తమస్సును దాటి పరమ పదము నొందుదురు.

ఏ జీవుడు గోవింద పాదారవిందములను శరణు బొందునో వాని సమస్త పాపములు నామ ఉచ్చారణ ప్రభావము వలన దహింప బడును. కృష్ణ నామము ఉచ్చరించుచు పశ్చాత్తప్తుడై కన్నీరు గార్చుచు తన యొక్క దోషములను భగవంతునికి విన్నవించిన యెడల వాని పాపములు భక్తి వలన అతి శీఘ్రముగా నశించును.

**కర్మ ప్రాయశ్చిత్తము వలన వాసనలు నశించవు.**

కర్మ, జ్ఞానముల ప్రాయశ్చిత్తము వలన ఫలితమేమి యున్నది? దాని వలన ఫలితము దుర్బలమైనది, అశాశ్వతమైనది. ఒక్క కృష్ణ నామోచ్చారణము వలననే అనేక జన్మముల పాపము నశించును. మరల అట్టివాడు కోటి జన్మలలో కూడా పాపము చేయలేదు. ధర్మ శాస్త్రములలో వర్ణింప బడని పాపములను సైతము కృష్ణ నామము నశింపజేయును. అయినచో స్మార్తులు ఎందుకు ప్రాయశ్చిత్తములను జేసికొందురు?

సుకృతము లేని కారణమున వారి మనస్సు వైదిక లౌకిక కర్మలచే ఆకర్షింప బడుచున్నది. కర్మ

ప్రాయశ్చిత్తము వలన మనసులో కొంతవరకు మార్పు కలుగును, గాని వాసనలు నశింపవు.

**వాసనకు మూల కారణమగు అవిద్య భక్తి వలన నశించును.**

కర్మ, జ్ఞానముల యొక్క ప్రాయశ్చిత్తముల ద్వారా పాప వాసనలు నశించవు. ఒకవేళ నశించినను కొంత కాలమునకు మరల స్థూల రూపము ధరించి మొలకెత్తును. కాని వాసనలకు మూల కారణమైన అవిద్య వేళ్ళతో సహా పూర్తిగా భక్తి వలననే నశించును.

ఎవరు గోవిందుని శరణు జొచ్చి ఆర్తితో, నమ్రతతో నామము చేయుదురో, అట్టి వారికి భగవంతుని ఉపదేశములు మధురముగాను, శ్రావ్యముగాను ఉండును. దానివలన జీవునికి శ్రేయస్సు కలుగును. దీనికి ప్రమాణములు పెక్కు గలవు.

**భగవద్గీత:**

సర్వ **ధర్మాన్ పరిత్యజ్య ............. (18-66)**
**అపిచేత్ సుదురాచారో ................(9-30)**
**క్షిప్రంభవతి ధర్మాత్మా ................(9-31)**

**నామము యొక్క ఫలితము:**

కావున బుద్ధిమంతుడు కర్మ సంగ ప్రాయశ్చిత్తముల కన్నా, ప్రాణేశ్వరుడైన భగవన్నామమునే భజించును. కృష్ణ నామము దయా సముద్రము. కృష్ణుడు తేజోమయుడు. ఆయన స్తావరజంగములకు కూడా ముక్తిని ప్రసాదించును. నామాపరాధము వలన నామ ఫలము సిద్ధించదు. నామ ప్రభావము వలన మహాపరాధ దోషములు గూడ శమించును. నామము తప్ప జీవునకు జగద్బంధువు వేరెవరును లేరు.

**నామాపరాధము:**

**నారద ఉవాచ:**

నారదుడు సనత్కుమారునితో "గురువర్యా! నామాపరాధములు ఎన్నియో సెలవిండు, జీవుడు నామ యజ్ఞము చేయవలెను. ఆ యజ్ఞము చేయునపుడు పతనము రాకుండుటకు మార్గము కూడా చెప్పుడు. ప్రాకృత బుద్ధితో నామము చేసిన యెడల ప్రాకృత ఫలమునే ఇచ్చును గదా! కావున వీటన్నిటిని గూర్చి విపులీకరించి తెలియజేయుడు" అని అడుగగా

**శ్రీ సనత్కుమార ఉవాచ:**

మంగళ స్వరూపుడైన హరియే పరతత్త్వము. అప్రాకృత స్వరూపముతో భగవంతుడు వ్రజ మండలములో విహరించుచున్నాడు. ఆ హరియొక్క నామమును జపము చేయునపుడు కల్గు అపరాధములు ఫది. వాటిని విపులముగా తెలిసికొని ప్రయత్నముతో విసర్జించవలెను.

ప్రథమ అపరాధమైన సాధు నిందను, ద్వితీయ అపరాధమైన ఇతర దేవతాదూషణమును గూర్చి చెప్పెదను వినుము.

ఎవరు ఏకాంతమున కృష్ణ నామమును ఉచ్చరించుదురో అట్టి వారిని సాధువని వ్యవహరింతురు. దాని వలన వారు సంసార సముద్రమునుండి ఉత్తీర్ణులగుదురు. సాధువులు ఐహిక జడ కర్మ, జ్ఞాన యత్నములు విసర్జించి శుద్ధ భక్తి భావముతో నామమును ఉచ్చరింతురు. వీరే నామమును ప్రచారము చేయుటకు సమర్థులు.

**1. సాధు నింద:** సాధువులను దూషించిన యెడల కృష్ణ నామమును చేసిన ఫలితమును ఎన్నడును మనము పొందలేము. పైన చెప్పిన లక్షణములుగల సాధువులను నిందించినను, వారిని అల్పబుద్ధితో చూచినను సాధు నింద యను గొప్ప అపరాధము కలుగును. ఇట్టి అపరాధమును బహుజాగ్రత్తగా విసర్జించ వలెను. భగవంతుని నామ, రూప, గుణ లీలలు అప్రాకృతములు. అవి భగవంతుని స్వరూపముకంటే వేరు కావు. భగవంతుని నామము, రూపము భిన్నములు కావు. రెండును అప్రాకృతములే. జడ బుద్ధితో నున్న మనము ఈ నామ రహస్యము గ్రహింప లేము. స్వచ్ఛమైన జ్ఞానమువలన, భక్తి వలన మాత్రమె ఈ విషయము తెలియును. తర్కమునకు గోచరము కాదు. మనము చేసిన సాధన వలన, గురు

కృప వలనను ఈ తత్వమును తెలిసికొన గలుగుదుము. ఈ తత్వ సిద్ధి లభించనంత వరకు మన యందు ప్రాకృత బుద్ధి నశింపదు. నామము చేసి నామ స్వరూపము అనుభూతి పొందనంత వరకు మనము చేసిన నామము నామాభాసము మాత్రమె యని గ్రహించవలెను. ఎంతయో ప్రయత్నము చేసిన గాని మనకు స్వరూప సిద్ధి కలుగదు. శుద్ధ నామోచ్చారణ వలన మనకు పరమ పదమునకు వెడలుటకు ఇచ్ఛ కలుగును. జాగ్రత్తగా శ్రద్ధతో గూడి నామాభాసముతో నామము చేయగా చేయగా భగవంతుడు అనుగ్రహించి తన స్వరూపసిద్ధిని మనకు కలుగ జేయును.

**2. కృష్ణుడు సర్వేశ్వరుడు. శివాది దేవతలు అంశము.**

కృష్ణుడు సర్వేశ్వరుడనియు, శివాది దేవతలు ఆయన అంశములనియు నిశ్చయపూర్వకముగా తెలిసికొనుము. కృష్ణుడు దేవతలకు వారి వారి నామాది గుణములను బట్టి వారికి తగిన శక్తిని ప్రసాదించెను. వారు సిద్ధ స్వరూపులు. ఈ విధముగా విష్ణువు, శివుడు మొదలగు దేవతలకు భేదము లేదు. దీనిని తెలిసికొనిన జీవునకు స్వరూప సిద్ధి కలుగునని నాల్గు వేదములందు చెప్పబడినది. విష్ణువు శివాది దేవతలకంటే వేరను భేద బుద్ధి యను అపరాధమును యత్నముతో త్యజించి గుర్వనుగ్రహమున నామ భజనము చేయవలెను.

**3. గురు అవజ్ఞత:**

ఎవరు దయతో హరినామోపదేశము ద్వారా భగవంతుని దర్శింపజేయుదురో అట్టి గురువు మనకు కర్ణ ధారుడు. అనగా మన జీవితమనేడి నౌకను సరియగు మార్గమున నడిపి గమ్య స్థానమగు భగవత్ప్రాప్తిని కలుగ జేయువాడే గురువు. అట్టి మహాశయుడగు గురువును నిందించుట, ఆదరింపక పోవుటయు మహాపరాధము. మరియు హీన జాతికి జెందిన వాడు, పాండిత్య రహితుడు, మంత్రహీనుడను బుద్ధితో గురువును చూచుట కూడా అపరాధము. దీని వలన మనము పరమార్ధ విషయమున వెనుక బడుదుము.

**4. శృతిశాస్త్ర నింద:**

శ్రుతులు, శాస్త్రములు భగవంతుని స్వరూపము ఆయన లీలలు, ప్రభావము గూర్చియు, నామ మహాత్మ్యమును గూర్చియు మనకు తెలియజేయును. అట్టి శృతి శాస్త్రములను నిందించుట అపరాధము.

**5. నామము కల్పింపబడినది అనియెడు బుద్ధి:**

భగవంతుని నామము చిన్మయమైనది, అగాథమైనది, అది మనకు నిత్య ధనము. అట్టి నామము కల్పితమని, ప్రాక్రుతమని భావించుట అపరాధములలో మేటి.

**6. నామ బలముచే పాపము చేయుట:**

కొందరు నామము చేయుచునే పాపకార్యములను గూడ చేయుదురు. నామ బలమును ఆధారముగా జేసికొని పాపక్రుత్యములు జేయుచు వాటినుండి విముక్తులమగుదుమని తలంచుట భ్రమ. ఇది అపరాధమగును.

**7. నామము ప్రయోజనము కొరకు ఉపయోగించుట:**

కర్మ మార్గమునందు చెప్పబడిన (దైవ కార్యములు) పద్ధతుల ననుసరించిన తాత్కాలిక ఫలితములను పొందగలుగుదుము. కాని భక్తి మార్గమునందు చెప్పబడిన దైవ కార్యముల వలన శాశ్వత ఫలితములను అప్రాకృత ఫలితములను పొందవచ్చును. నామము యొక్క ఫలితము వర్ణనాతీతమైనదని తలంచి నామమును ఐహిక ప్రయోజనము కొరకు ఉపయోగించుట అపరాధము. ఈ అపరాధములను దరికి రానీయక నామమును చేసిన యెడల సత్ఫలితములను పొందవచ్చును.

**8. శుభ కర్మలతో నామము సమానముగా భావించుట:**

శాస్త్రోక్తములైన వర్ణాశ్రమ ధర్మములు, దర్శ పౌర్ణ మాసాది తామసిక వ్రతములు, దండి ముండి మున్నగు సన్యాస ఆశ్రమ నియమములు, నిత్య నైమిత్తికాది హోమములు, అష్టాంగ షడంగాది శుభకర్మములు మొదలగునవన్నియు ప్రాక్రుతములే. వీటివలన క్షణికమైన ప్రాకృత ఫలితములనే పొందవచ్చును. ఈ వ్రతములు శుభ కర్మల వలన సాధ్య వస్తువును

(భగవంతుని) పొందలేము.  భగవన్నామమును ఉచ్చరించుట వలన శాశ్వతమైన అప్రాకృత ధామమును జేరగలము.

**నామమే ఉపాయము - ఉపేయము**

ఇతర కర్మల యందు సాధన (ఉపాయము) వేరు; దానివలన పొందబడే సాధ్యము (ఉపేయము) వేరు.  సాధ్య వస్తువు లభించిన తరువాత సాధన తో పని లేదు.  కాని భగవన్నామము అట్టిది కాదు.  ఏ నామము సాధన కాలమునందు ఉపాయముగా నుండునో అదే నామము సిద్ధావస్థలో ఉపేయముగ నుండును.  నామమే సాధన, నామమే సాధ్యము.  కావున నామము విశుద్ధమైనది. చిన్మయమైనది.

జడములగు ఉపాయ కర్మలు (కర్మ, జ్ఞానములు) ఎన్నడును నామముతో సమానము కానేరవు.  అట్లు సమానమని తలంచుట మహాపరాధము.

**9. విశ్వాస హీనునకు నామము నుపదేశించుట:**

భగవంతుని యందు, భగవన్నామమునందు విశ్వాసము లేని భాగ్య హీనునకు నామమును ఉపదేశించుట గూడ మహత్తర అపరాధమగును.  ఇట్టి అపరాధమును సాధుగురు అనుగ్రహము వలన యత్నముతో తొలగించవలెను.  అపుడే నామము యొక్క ఫలితమును పొందగలము.

**10. శ్రీనామ మహాత్మ్యమును వినియు నామమునందు అనురాగము లేకుండుట:**

శాస్త్రముల ద్వారా నామ మహత్తును శ్రవణము చేసియు నెవడు దానియందు ప్రీతి నొందక దేహాత్మ బుద్ధితో అహంకార మమకారములతో పేరు ప్రతిష్ఠలకై ప్రాకులాడునో, పాప కార్యములందే నిరతుడై యుండునో, పాపము నుండి విముఖుడగుటకు యత్నము గూడ చేయడో అట్టివాడు శ్రద్ధతో నామమును చేయలేడు.  అసద్విషయములందు ఆసక్తి కల్గి యుండిన కారణమున సత్సాంగత్యమునందు వానికి బుద్ధి ప్రవేశింపదు.  ఐహిక సుఖముల కొరకు వాడు వివేక వైరాగ్యములను జారవిడుచుకొనును.  దీని వలన వారికి అపరాధము కలుగుచున్నది.  ఈ అపరాధ ఫలితముగానే నామమునందు రుచి కలుగుట లేదు.  వాడు కృష్ణ సంసారమయముగా

జీవితమును గడుపుట లేదు.

(1. సాధు నింద; 2. శివాది దేవతలను భగవానునితో సమానమను భావము కలిగియుండుట; 3. శృతి శాస్త్ర నింద; 4. గురువును నిర్లక్ష్యము చేయుట; 5.  ఇతర శుభ కర్మలతో నామము సమానమని తలంచుట; 6. నామము కల్పితమని భావించుట; 7. నామ బలముతో పాపము చేయుట; 8. విశ్వాస హీనునకు నామమును ఉపదేశించుట; 9. నామ మహిమను కేవలము స్తవమని తలంచుట; 10. శ్రీనామ మహాత్మ్యమును వినియు అహంకార మమకార యుక్తుడై నామము నందు రుచి లేనివాడగుట) - ఈ పది నామాపరాధములు మన పరమార్ధమునకు ప్రతి బంధకము కలిగించి నామము యొక్క ఫలమును దూరము చేయును.  దానివలన మనకు శ్రేయస్సు నిరుద్ధమగును.

జీవుని సమస్త అపరాధములు, పాపము, తాపత్రయములు హరిని ఆశ్రయించిన యెడల తత్క్షణము క్షీణించును.  ఎవరు కలిసంసారమును పరిత్యజించి నిష్కపటముగా కృష్ణసంసారము చేయుదురో వారికి ఎట్టి అపరాధములు అంటవు (కృష్ణ సంసారమనగా సమస్త కార్యములు భగవదర్పణముగా చేయుట, కలి  సంసారమనగా స్వప్రయోజనము కొరకు జీవితము గడుపుట యని తెలిసికోనవలెను)

భగవంతునకు, భగవన్నామమునకు భేదము లేదు.  కావున నామము నాశ్రయించిన వారికి గూడ అనేక జన్మార్జిత పాపములు క్షీణించును.  నిష్కపటముగా మనమెప్పుడు భగవంతునికి ఆత్మనివేదనము చేయుదుమో అపుడు కృష్ణుడు మన పూర్వకృత సమస్త పాపములను తొలగించును.  అప్పుడు ఇంకా ప్రాయశ్చిత్తములతో పని లేదు.  హరి దీక్షను పొందినంత మాత్రముననే బహుజన్మలలో చేసిన పాపములు ఖండింప బడుచున్నవి.  నిష్కపటముగా హరిని ఆశ్రయించినచో అపరాధములు తొలగుటయే గాక, పాప కృత్యమందు అభిలాష నశించును.  తాపత్రయము తొలగును. దానిచే మాయను అనాయాసముగా జయింప వచ్చును.

**సేవాపరాధము:** నామాపరాధమే గాక సాధకునకు సేవాపరాధము వలన గూడ భక్తికి ఆటంకమేర్పడును. సాధుసంగములోనుండి కృష్ణ నామము నాశ్రయించిన యెడల సేవాపరాధము నశించును. నామానుగ్రహమువలన జీవునకు సర్వసిద్ధి కలుగును. అపుడు కృష్ణ సాన్నిధ్యమున నుండి చిన్మయమైన సేవ చేయ గలుగును.

**నామాపరాధములను సర్వదా త్యజింప వలెను:**
నామాపరాధములను తెలిసికొని గూడ నామాపరాధము చేసిన యెడల పతితులగుట తథ్యము. హరి నామము సర్వ జీవులకు బంధువు. అట్టి నామము విషయమున అపరాధము చేసిన యెడల మనకు సంతరణ మార్గముండదు. కావున బహుజాగరూకతతో నామాపరాధము చేయకుండుటకు యత్నము చేయవలెను. నామానుగ్రహమువలన భగవత్ప్రాప్తి లభించిన జీవునకు సర్వము లభించినట్లే.

ఈ విషయమునే సనత్కుమారుడు ఒకరోజున నామాపరాధమును గూర్చి చెప్పుచు భగవంతుని యొక్క నామము జీవునకు సమస్త మంగళములు చేకూర్చుననియు, అట్టి నామము యెడల అపరాధము చేసిన అమంగళము కలుగునని శ్రేయోభిలాషులు సదా సర్వత్రా నామాపరాధములను త్యజించ వలెనని శివుడు చెప్పినట్లు నారదునకు తెలియజేసెను.

కావున సద్గురువునాశ్రయించి, వినయ విధేయతలతో నామాపరాధములను గూర్చి తెలిసికొని యత్నముతో తొలగించు కొనిన యెడల అనతి కాలములో కృష్ణ ప్రేమను పొందవచ్చును. దీక్షతో నామమును తీసికొని నామాపరాధమును తొలగించుకొనుటకు యత్నము చేయని వారికి అపరాధములు ఆవరించును. అపరాధమని తెలిసియు దానియందు ఉదాసీనముగానున్న యెడల చిరకాలము దుఃఖము అనుభవించవలసి యుండును. తల్లిమీద కోపగించి పిల్లవాడు భోజనము మానినట్లును, మందు వాడుచు పథ్యము చేయని రోగివలెను, భగవన్నామము చేయుచు వేరొక ప్రక్క అపరాధములు మాననిచో శ్రేయస్సు లభించదు.

కావున ఓ దేవర్షీ! నామాపరాధములను విడిచిపెట్టి ఎల్లప్పుడు నామమును జపించ వలెను. నామము తప్ప వస్తుసిద్ధికి (భగవత్ప్రాప్తికి) వేరు మార్గము లేదు. నామము చేతనే సర్వ సిద్ధులు లభించునని సనత్కుమారుడు చెప్పగా నారదుడు తిరిగి యిట్లు ప్రశ్నించెను.

ఓ సనత్కుమారా! మీరు సిద్ధ హరిదాసులు, నామ రహస్యమును గురించి చక్కగా వివరించితిరి. కాని మేము సాధకులము. ఈ అపరాధములను మేము ఎట్లు త్యజించి ముక్తులమగుదుము? విషయములే మాకు బంధువులు, వాటి సహకారముచే కర్మలు చేసిన మాకు మాయాబంధనమే కలుగును. వివేక వైరాగ్య శూన్యులైన దేహప్రియులము మేము నిరంతరమూ ధనాసక్తులమై యుందుము. ఇట్టి పరిస్థితులలో మాకు ఈ అపరాధములు యెట్లు రాకుండునో దయచేసి బోధింపుడు.

**శ్రీసనత్కుమారుడు ఇట్లు చెప్పెను:**
ఎవరు హరినామమును శరణు బొందుదురో అట్టివారి అపరాధములు తత్క్షణమే క్షీణించును; తదనంతరము అపరాధము కలిగిన యెడల అది భక్తికి ప్రతికూలమే. ప్రమాద వశమున అపరాధము సంభవించినచో అనుక్షణము నామ సంకీర్తన చేయవలెను. ఇంకను ధృడముగా నామమునే శరణు బొందవలెను. సతతము హరినామము చేయువారికి అపరాధములు అంటవు. పూర్వము చేసిన అపరాధములు నశించును.

**నామమే ఉపాయము:**
దశ నామాపరాధములు నామస్మరణము వలననే దూరీ భూతములగును. ఇది తప్ప వేరు గతి లేదు. ఓ నారదా! వేదములలో చెప్పబడిన యే మూలతత్వమును గురించి నీవు నిత్యము గానము చెయుచుందుదువో దానిని గూర్చియే నేను చెప్పితిని.

నిరపరాధముగా స్పష్టముగా ఎవరు నామ శ్రవణ, కీర్తన, స్మరణములను చేయుదురో వారు తప్పక తరింతురు. నామము, నామి ఒకటే యని గ్రహించి నామము చేసినచో అవిద్య నశించును. శుద్ధ నామమునకు ఉచ్చారణ దోషము ఉండదు. భగవన్నామము

అప్రాకృతమైనది. కృష్ణుడు తన నామమునకు సర్వశక్తులనర్పించెను. నామోచ్చారణకు దేశాదేశ, కాలాకాల, శౌచాచౌచ నియమములు లేవు. కావున సర్వకాల సర్వావస్థల యందు శుద్ధ నామమును కీర్తించుము. దానివలన సర్వ శ్రేయస్సులు లభించును, సర్వ అశుభములు క్షీణించును.

**అసత్సంగమును పరిత్యజించి నామమును చేయవలెను:**

ఇట్టి అపూర్వమైన నామము దుర్జన సాంగత్యము చేయుచు చేసిన సత్ఫలితములనీయదు. దేహ, ధన, జన, లోభ, పాషండ సంగతి వలన నామఫలమునకు ఆటంకము ఏర్పడి జీవుడు భ్రమ నొందుటకు అవకాశము గలదు. కావున మున్ముందుగా విషయముల సాంగత్యము విడచి అనన్య శరణత్వ బుద్ధితో నామము చేయవలెను. నామానుగ్రహము వలన ప్రమాద రహితుడై, అపరాధ రహితుడై శ్రేయస్సు నొందగలడు, నిరపరాధముగా కృష్ణ నామము నాశ్రయించుట వలన కృష్ణ ప్రేమ లభించును. ఇదియే మానవ జీవిత చరమ లక్ష్యము. అపరాధ యుక్తమైన నామము వలన కైతవమే లభించును. అట్టి దుస్సాంగత్యమును త్యజించి నామము నాశ్రయిమ్పవలెను.

ఓ నారదా! పూర్వము శంకరుడు నాకు సర్వ అశుభ నాశకరమగు ఈ నామ రహస్యమును అపరాధ నివారణోపాయమును చెప్పినారు. అపరాధ యుక్తులు గూడ విష్ణు నామమును ఆశ్రయించినచో ముక్తులగుదురు.

**నామ రహస్య ప్రచారము:**

ఓ స్వరూప దామోదరా! రాయరామానందా! ఈ నామ రహస్యమును మీరు అవశ్యము ప్రచారము చేయుడు. కలి యుగములో జీవులు తరించుటకు నామము తప్ప వేరు గతి లేదు. నేను పూర్వము చెప్పిన శిక్షాష్టక తత్త్వము గూడ వ్యాసుల వారి వాక్యములలో (భాగవతములో) నున్నది.

అందరు కలిసి నామ ప్రచారము చేయుడు. అనుక్షణము నామరహస్యమును స్మరించి నామసంకీర్తనము చేయుడు. నామాచార్య హరిదాసు ఈ నామ రహస్యమును గురించి ఇదివరలోనే ప్రచారము చేసి యున్నాడు. ఈ నామ రహస్యమును తెలిసికొని ఆచరించి ప్రచారము చేసెను. కావున అతడు "నామాచార్య హరిదాసు" అని ప్రఖ్యాతి గాంచెను. ఎవరు నామాచార్య హరిదాసు ననుసరించి నామ భజన చేయుదురో వారు తప్పక సిద్ధి పొందుదురు.

--

**కళ్ళు మూసినప్పుడు దైవాన్ని ధ్యానంలోను,**

**కళ్ళు తెరిచినప్పుడు ప్రకృతిలోనూ చూడగలిగితే సాధన సార్ధకమైనట్లు**

**ఓం నమో భగవతే వాసుదేవాయ**

**సర్వం శ్రీ ఆంజనేయ స్వామి పాదారవిందార్పణమస్తు**

**కె.బి. నారాయణ శర్మ - నాకు తెలిసింది అల్పం తెలుసుకో వలసినది అనంతం.**